సాక్షి పల్నాడు

సోమవారం । 27 । మార్చి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.7429 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు ఎగువ నుంచి 2200 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: లోక సంరక్షణార్థం ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అర్చకులు సూర్యభగవానుడి చిత్రపటానికి పూజలు నిర్వహించారు.



కిక్కిరిసిన కార్తికేయుని సన్నిధి

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారిని దర్శించుకొని, నాగ పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
నరసరావుపేట	6:27	4:46
గుంటూరు	6:25	4:50
బాపట్ల	6:25	4:50

భద్రత.. భరోసా

పరిష్కార వేదిక.. 'పల్లె నిద్ర'

ప్రజలతో మమేకం కావడం.. సమస్యలను ఆదిలోనే పరిష్కరించడం.. ప్రజల్లో పోలీసులంటే ఉన్న భయాన్ని తొలగించడం.. ఇదీ పల్నాడు జిల్లా పోలీసులు చేపట్టిన వినూత్న కార్యక్రమం పల్లెనిద్ర ముఖ్య ఉద్దేశం. సమస్యాత్మక గ్రామాల్లో రాత్రిళ్లు బస చేయడం, ఉదయాన్నే ఆ ప్రాంతంలో పర్యటించడం వల్ల చిన్న చిన్న సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవడమే కాకుండా ప్రజల్లో సైతం ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై అవగాహన ఏర్పడే అవకాశం ఉంది.

- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పల్నాడు జిల్లా ఎస్పీ
- పల్లె నిద్ర పేరిట సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల సమావేశాలు
- ప్రజలతో మాటామంతీ, గ్రామాల్లోనే నిద్ర
- ఉదయం గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి నడక
- శనివారం రాత్రి 34 గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం విజయవంతం
- గ్రామస్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపుతామంటున్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి



నరసరావుపేట టూటౌన్ పరిధిలోని పెద్ద చెరువులో పల్లె నిద్రలో భాగంగా ప్రభుత్వ భవనంలో నిద్రిస్తున్న సీఐ వీరేంద్రబాబు



రొంపిచర్ల మండలం ఆలవాల గ్రామంలో ప్రజలతో ముచ్చటిస్తున్న సీఐ భక్తవత్సల రెడ్డి

సాక్షి, నరసరావుపేట: పల్నాడు ప్రాంతం ప్రేమానురాగాలకు పుట్టినిల్లు. ఈ ప్రాంత ప్రజలకు ప్రేమ ఎంతుంటుందో పౌరుషం కూడా అంతే మోతాదులో ఉంటుంది. చిన్న చిన్న మనస్పర్థలు, సమస్యలు సైతం పట్టింపులకు పోయి తీవ్ర నేరాల వరకు దారి తీస్తుంటాయి. వాటిని ఆదిలోనే అదుపు చేస్తేనే జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉంటాయి. ఈ విషయాన్ని గుర్తించిన పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'పల్లె నిద్ర' పేరుతో పోలీసులు గ్రామ, వార్డు స్థాయిల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి అక్కడే రాత్రి మకాం చేసి నిద్రపోతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభించారు. ఇక మీదట ప్రతి నెలలో రెండు, నాలుగో శనివారాలు పల్లె నిద్ర కార్యక్రమం జరగనుంది. గత శనివారం పల్నాడు జిల్లాలోని 34 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. శనివారం రాత్రి పల్లె నిద్ర చేసి, ఆదివారం ఉదయం వీధుల్లో పోలీసులు నడక సాగించి ప్రజల వద్దకు వెళ్లారు. పల్లె నిద్ర కార్యక్రమం అమలును ఎస్పీ రవిశంకర్ రెడ్డి శనివారం రాత్రి పలు ప్రాంతాల్లో పర్యటించి పర్యవేక్షించారు.

ప్రజలతో మమేకం...

పల్లె నిద్రలో భాగంగా పోలీసుల ఆయా స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలను ఎంచుకుంటారు. ముందు రోజే ఆ గ్రామస్తులకు సమాచారం అందించి, సాయంత్రం 7 గంటలకు గ్రామ సచివాలయం లేదా మరేదైనా ప్రభుత్వ భవనాల వద్ద సమావేశాలు ఏర్పాటు చేస్తారు. ఆ గ్రామంలో ఎటువంటి నేరాలు జరుగుతున్నాయి, సమస్యాత్మక వ్యక్తులు ఎవరు, ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో పోలీసులు గుర్తించి పక్కా సమాచారంతో గ్రామానికి వెళతారు. వాటిపై ప్రజలతో ముచ్చటిస్తారు. తర్వాత ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. భూ సమస్యలు, వివాహేతర సంబంధాలు వల్ల ఏర్పడే సమస్యలను వీలైనంత వరకు అక్కడే పరిష్కరించి నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేస్తారు. పోలీస్‌స్టేషన్ గుమ్మం తొక్కలేని చిన్న, చిన్న సమస్యలకు తగిన పరిష్కారం చూపుతారు.

రాత్రి బస.. ఉదయం నడక

పల్లె నిద్రలో భాగంగా ప్రజలతో మమేకమైన తర్వాత పోలీసు అధికారులు సమస్యాత్మక గ్రామాల్లోనే రాత్రి బస చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి గ్రామం, వార్డులోని వీధి వీధి తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకుంటున్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖ వంటి వివిధ శాఖల సమస్యలను ప్రజలనుంచి తెలుసుకొని ఆయా శాఖలకు నివేదించి సమస్యలకు పరిష్కారం దక్కేలా ప్రయత్నిస్తారు. ప్రజలకు కనిపించేలా పోలీసు అధికారుల, సిబ్బంది ఫోన్ నెంబర్లు రాసి ప్రజలు ఫోన్ ద్వారా సమస్యలు తెలిపేలా ప్రోత్సహిస్తారు. పల్లె నిద్ర కార్యక్రమంలో మహిళా పోలీసులతో పాటు సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూస్తున్నారు.

ఆదిలోనే గుర్తించి పరిష్కరించేందుకే...



గ్రామాల్లో రెవెన్యూ, వివాహేతర సంబంధాల వల్ల ఏర్పడే చిన్న చిన్న గొడవలే తర్వాత పెద్ద నేరాలకు దారితీసే అవకాశాలున్నాయి. వాటిని ఆదిలోనే గుర్తించి పరిష్కరిస్తే తీవ్ర నేరాలు జరిగే ఆస్కారం ఉండదు. ఆ ఉద్దేశంతోనే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నాం. తొలి వారం పల్లె నిద్ర విజయవంతంగా పూర్తయింది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింతగా ప్రజల్లోకి ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను తీసుకువెళ్తాం.

– వై.రవిశంకర్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సెలవురోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఉదయం తొమ్మిది గంటల వరకే ఘాట్‌రోడ్డుపైకి ద్విచక్ర వాహనాలనే అనుమతించి, కార్లు, ఇతర వాహనాలను కనకదుర్గనగర్‌కు మళ్లించారు. అక్కడ కూడా ఉదయం పది గంటలకే పార్కింగ్ నిండిపోవడంతో వీఎంసీ కార్యాలయం సమీపంలోని ఇరిగేషన్ స్థలంలోకి కార్లను మళ్లించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. రద్దీతో భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా ఆలయ ఈఓ భ్రమరాంబ అంతరాలయం వద్ద క్యూలైన్లను పర్యవేక్షించగా, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమా చిన్న గాలిగోపురం, స్కానింగ్ పాయింట్ల వద్ద పర్యవేక్షించారు. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు ఉదయం 11.40 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. మహా మండపం ఐదో అంతస్తు వరకు, ఇటు ఘాట్‌రోడ్డులో సమాచార కేంద్రం వరకు సర్వ దర్శనం క్యూలైన్లు కిటకిటలాడాయి. రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం పంచహారతుల సేవలోనూ ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 532.10 అడుగుల వద్ద ఉంది. ఇది 172.2745 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 6,465, ఎడమకాలువకు 7,768, ఎస్‌ఎల్‌బీసీకి 2,000, వరదకాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 16,553 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి వచ్చే నీటి చేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.50 అడుగుల వద్ద ఉంది. ఇది 34.0048 టీఎంసీలకు సమానం.

ఎన్టీటీపీఎస్‌లో మారిన బయోమెట్రిక్ వేళలు

ఇబ్రహీంపట్నం(మైలవరం): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్‌లో బయోమెట్రిక్ సమయాలను మార్పులు చేస్తూ ఏపీ జెన్‌కో సంస్థ ఎండీ శ్రీధర్ ఈ నెల 21వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయి. గతంలో జనరల్ షిఫ్ట్‌లో ఉదయం తొమ్మిది, సాయంత్రం 5.30 గంటలకు బయోమెట్రిక్ వేసేవారు. నూతన విధానంలో ఉదయం, సాయంత్రంతో పాటు మధ్యాహ్నం ఒంటి గంటకు లంచ్ బ్రేక్, తిరిగి రెండు గంటలకు విధులకు హాజరయ్యేటప్పుడు కూడా బయోమెట్రిక్ వేయాలి. మూడు షిఫ్టుల్లో ఉద్యోగులు పాత పద్ధతుల్లో విధులకు హాజరయ్యే ముందు, తిరిగి వెళ్లే సమయాల్లో బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. జనరల్ షిఫ్ట్ ఉద్యోగులు నాలుగు సార్లు బయోమెట్రిక్ వేయకుంటే ఆ రోజు హాజరు నమోదు కాదు అనే నిబంధన పెట్టారు.

నేడు దుర్గగుడి పాలక మండలి సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సమావేశం సోమవారం జరగనుంది. మహా మండపం నాలుగో అంతస్తులోని సమావేశ మందిరంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు. దుర్గగుడి పాలక మండలి ఫిబ్రవరి ఏడో తేదీన ఏర్పడింది. పాలక మండలి ఏర్పడిన తర్వాత ఇది రెండో సమావేశం. గత నెల 27వ తేదీన జరిగిన తొలి సమావేశంలో భక్తుల సౌలభ్యం కోసం పాలక మండలి కొన్ని ప్రతిపాదనలు చేసింది. దుర్గాఘాట్ నుంచి భక్తులకు ఉచిత బస్సు సర్వీసు, ఉచిత చెప్పుల స్టాండ్, పొంగలి షెడ్డు, హారతి సేవలో పాల్గొన్న భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం అందించే అంశాలు ఉన్నాయి. వీటిలో ఘాట్‌రోడ్డులో పొంగలి షెడ్డు ఏర్పాటు చేయడం మినహా మిగిలిన ప్రతిపాదనలు ఇంకా ఆచరణలోకి రాలేదు. వీటిలో కొన్నింటికి దేవదాయ శాఖ కమిషనర్ నుంచి అనుమతి రావాల్సి ఉంది. వాటిపై ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి.

మరువం.. మురిపెం

దుర్గమ్మకు దవళం, మరువంతో అర్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం విశేష పుష్పార్చన జరిగింది. ఉత్సవాలలో భాగంగా 5వ రోజైన ఆదివారం అమ్మవారికి దవళం, మరువంత, తెల్లజిల్లేడు, మారేడు, తులసీలతో అర్చన నిర్వహించారు. తొలుత విశేష పుష్పార్చనకు వినియోగించే పుష్పాలతో ఆలయ మహిళా సిబ్బంది ఊరేగింపుగా వేదిక వద్దకు చేరుకున్నారు. రాజగోపురం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు చిన్న రాజగోపురం సమీపంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్దకు చేరుకుంది. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పుష్పార్చన నిర్వహించగా, ఆలయ ఈవో భ్రమరాంబ, ఆలయ అధికారులు, భక్తులు, ఉభయదాతలు విశేష పుష్పార్చనను కనులారా వీక్షించారు. అర్చన అనంతరం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు.

వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనది

- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ
- ఘనంగా గుంటూరు వైద్యకళాశాల గ్రాడ్యుయేషన్ డే

గుంటూరుమెడికల్: మెడికల్ ప్రొఫెషన్ ఎవర్‌గ్రీన్ అని, ప్రపంచ వ్యాప్తంగా వైద్యవృత్తికి విలువ ఎన్నటికీ తగ్గదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. వైద్యులు సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో వైద్య కళాశాల 2017 బ్యాచ్ ఎంబీబీఎస్ వైద్య విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ వైద్య వృత్తి అత్యంత పవిత్రమైందని, వైద్యులు మానవత్వంతో, మంచి నైపుణ్యంతో సేవలందించాలని చెప్పారు. వైద్యులకు, సమాజానికి కొంత గ్యాప్ ఉందని, డాక్టర్‌పై నమ్మకం కలిగేలా వైద్యం అందించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలకు చెందిన ప్రజలు మన దేశంలో వైద్యసేవలు పొందేందుకు వస్తున్నారని, మెడికల్ సర్వీసెస్ ద్వారా ప్రతి ఏడాది లక్షా పదివేల కోట్ల రూపాయల ఆదాయం దేశానికి వస్తుందని డాక్టర్ జయప్రకాష్ నారాయణ చెప్పారు. ప్రతి ఏడాది దేశంలో యువ వైద్యులు హెల్త్ కేర్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింకానా పేరుతో చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. దేశంలోనే అందరికీ జింకానా ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు.

హెల్త్ కేర్‌కు సీఎం వైఎస్ జగన్ ఎంతో చేశారు..

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి దేవి మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేశారని చెప్పారు. వైద్య కళాశాలలో ఎన్నడూ లేని విధంగా డాక్టర్స్‌తో పాటుగా పారామెడికల్ పోస్టులన్నీ భర్తీ చేయటమే గాకుండా అదనంగా పోస్టులు సైతం మంజూరు చేశారన్నారు. పీజీ సీట్లు పెరిగేందుకు నాడు–నేడు కింద నిధులు కేటాయించారని, గతంలో ఎన్నడూ లేని విధంగా రెండేళ్లలో 60కి పైగా పీజీ సీట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ కేర్‌కు చాలా సపోర్ట్ చేస్తుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ తల్లిదండ్రుల డెడికేషన్‌తో పిల్లలు డాక్టర్లు అవుతున్నారని, వైద్యులు రోగులకు సేవ చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, జీజీహెచ్ డెప్యూటీ సూపరింటెండెంట్స్ డాక్టర్ సంధ్యావళి, డాక్టర్ పద్మశ్రీ, సీటీఎస్ రిటైర్డ్ హెచ్‌ఓడీ డాక్టర్ రామకృష్ణారెడ్డి యువ వైద్యులుగా బయటకు వస్తున్న వారికి పలు సూచనలు చేశారు. డాక్టర్ జయప్రకాష్ నారాయణ, వైద్య కళాశాల, జీజీహెచ్ అధికారుల చేతుల మీదుగా ఎంబీబీఎస్ డిగ్రీ పట్టాలను యువ వైద్యులు అందుకున్నారు. పలువురు వైద్యులు తమ తల్లిదండ్రులతో, తోటి వైద్యులతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు.





గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా యువ వైద్యుల ఆనంద హేళ (ఇన్‌సెట్) డాక్టర్ డిగ్రీ పట్టాను అందిస్తున్న డాక్టర్ జయప్రకాష్ నారాయణ, డాక్టర్ పద్మావతిదేవి, డాక్టర్ ప్రభావతి

కొండవీడు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

యడ్లపాడు: అంతర్జాతీయ స్థాయి పర్యాటకులను ఆకట్టుకునేలా కొండవీడులో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఎస్పీ రవిశంకర్, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్ కుటుంబ సభ్యులతో చారిత్రక కొండవీడు కోట ప్రాంతాన్ని సందర్శించారు. ముందుగా ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి చేరుకుని స్వాగత ద్వారం, పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న డైనింగ్ హాల్, చెరువులు, ఇతర అభివృద్ధి పనుల్ని స్వయంగా పరిశీలించారు. అక్కడ నుంచి అంతా కలిసి సజ్జమహల్ బురుజు పైకి ట్రెక్కింగ్ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రానికే తలమానికం అయ్యేలా పల్నాడు జిల్లాలోని చారిత్రక ప్రదేశం కొండవీడు కోటను గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే కొండపైకి విద్యుత్తు సౌకర్యం ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం ఏర్పాటు చేసి విద్యుత్ పోల్స్, సరఫరా ఇవ్వడం జరిగిందన్నారు. వెదుళ్ల చెరువు ఆహ్లాదకర వాతావరణాన్ని వీక్షించడంతో పాటు, అక్కడే సెల్ఫీలు దిగేందుకు ప్రత్యేకంగా చెరువుపై పది అడుగులు లోపలికి ప్లాంక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



ట్రెక్కింగ్ చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్, జేసీ శ్యామ్‌ప్రసాద్, కె.శివారెడ్డి

ఇకపై నైట్ క్యాంపులు...

అరకులోయ ప్రాంతంలో మాదిరిగా ఇకపై కొండవీడులోనూ నైట్‌క్యాంపులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీన ప్రస్తుతం సందర్శించిన అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులతో కలిసి కొండవీడులో నైట్ క్యాంప్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వెదుళ్ల చెరువులో పెడల్ బోటింగ్ ప్రాజెక్టును త్వరలోనే తీసుకువస్తామన్నారు. అలాగే సజ్జామహల్ నుంచి వెదుళ్ల చెరువు మీదుగా నెమళ్ల బురుజు వరకు రోప్ వే ఏర్పాటు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. రానున్న కొద్దిరోజుల్లోనే కొండవీడుకు మరిన్ని పర్యాటక శోభను చేకూర్చనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు ప్రస్తుతం కొండవీడుకు అప్రోజ్‌మార్గంలో రావాలంటే పుట్టకోట గ్రామంలో నుంచి రావాల్సి వస్తుందని, అలా కాకుండా గ్రామం వెలుపల ఉన్న మట్టికట్ట పక్కగా 380 మీటర్ల బైపాస్ మార్గం పనుల్ని చేపడతామన్నారు. వారి వెంట నరసరావుపేట డీఎస్పీ విజయ భాస్కర్, కొండవీడు రేంజ్ అధికారి రమణమ్మ, కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి, కొత్తపాలెం సర్పంచి ఎంవీ సుబ్బారావు, ఇతర శాఖల జిల్లాస్థాయి అధికారులు ఉన్నారు.

పని మనుషులే నిందితులు

- వృద్ధ దంపతుల ఇంట్లో చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- రూ. 20 లక్షల సొత్తు స్వాధీనం

తెనాలిరూరల్: నమ్మకంగా ఉంటూ యజమాని ఇంటికే కన్నం వేసిన దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగలను పట్టుకున్న పోలీసులు వారి వద్ద నుంచి సుమారు రూ. 20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ కె.స్రవంతిరాయ్ వివరాలు వెల్లడించారు. పట్టణ ఐతానగర్‌లోని లింగారావు సెంటరులో గల లింగారావు ఇంట్లో నన్నపనేని దుర్గాప్రసాద్, హేమలత దంపతులు నివసిస్తున్నారు. వృద్ధులైన వీరికి సహాయం చేసేందుకు రమావత్ చాందిని, రమావత్ కృష్ణలు సుమారు నాలుగేళ్ల క్రితం పనిలో చేరారు. వీరికి ఇంటి ఆవరణలోని షెడ్డులో ఆశ్రయం కల్పించి సొంత మనుషుల్లా చూసుకుంటున్నారు. హేమలత కుమారుడు పవన్‌కృష్ణ ఓ ఆలయ నిర్మాణానికి సహాయం చేసేందుకు కొద్ది నెలల క్రితం రూ. 5 లక్షలు తన తలిదండ్రుల వద్ద ఉంచాడు. ఆలయ నిర్వాహకులకు ఇచ్చేందుకు నగదు ఇవ్వమని తల్లిని కోరగా ఆమె బీరువాలో ఉంచిన నగదును తెచ్చి కుమారుడికి వచ్చింది. రూ 5 లక్షల్లో రూ. 40 వేలు తగ్గినట్టు గుర్తించిన పవన్‌కృష్ణ తలిదండ్రులను అడగ్గా వారు బీరువాను పరిశీలించారు. నగదు పక్కనే ఉంచిన రెండు బంగారు గాజులూ కనబడలేదు. దీంతో ఇంట్లోని మరో బీరువానూ పరిశీలించగా, అందులో ఉండాల్సిన సుమారు 400 గ్రాముల బంగారు ఆభరణాలు కనబడలేదు. బీరువాలకు వేసిన తాళాలు వేసినట్టే ఉన్నా నగదు, నగలు ఎలా మాయం అయ్యాయన్న అనుమానంతో పోలీసులను ఆశ్రయించారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హేమలత ఇంట్లోకి పని మనుషులు కాకుండా వేరే ఎవరికీ ప్రవేశం లేదు. దీంతో పోలీసులు పని మనుషులు చాందిని, కృష్ణలు చోరీకి పాల్పడి ఉంటారని భావించి ఆ దిశగా విచారణ చేపట్టారు. గోలిడొంక రోడ్డులో ఉండగా వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో నేరం అంగీకరించారు. సీఐ ఎస్.వెంకటరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ నరసింహారావు, కానిస్టేబుల్ సాంబశివరావు నిందితులు చెప్పిన దాని ప్రకారం రెండు బంగారు బిస్కెట్లు(ఒకొక్కటి 100 గ్రాములు), మూడు బంగారు గొలుసులు, రెండు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 20 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ స్రవంతిరాయ్, ముసుగులో నిందితులు

ఒకటో తేదీ నుంచి చైత్రమాస బ్రహ్మోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల చైత్రమాస బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ ఒకటో తేదీ చైత్ర శుద్ధ ఏకాదశి నుంచి 5వ తేదీ పౌర్ణమి వరకు జరగనున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో ఆది దంపతులకు రోజుకో వాహన సేవ నిర్వహిస్తారు. ఇక ఆరో తేదీ నుంచి 8వ తేదీ వరకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవలను వైదిక కమిటీ నిర్వహిస్తుంది. ఒకటో తేదీ శనివారం దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు మంగళ స్నానాలు, వధూవరులుగా అలంకరిస్తారు. సాయంత్రం గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన, కలశారాధన, ధ్వజారోహణం జరుగుతుంది. 3వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 10.30 గంటలకు దుర్గా మల్లేశ్వరుల దివ్య కల్యాణోత్సవం జరుగుతుంది. 5వ తేదీ పూర్ణాహుతి, అవభృత స్నానం, ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయి.

వాహన సేవలు ఇలా..

బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదు రోజుల పాటు ఆది దంపతులకు వివిధ వాహన సేవలు జరుగుతాయి. ఒకటో తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు వెండి పల్లకీపై ఆది దంపతులు నగర పుర వీధుల్లో విహరిస్తారు. 2న రావణ వాహన సేవ, 3న నంది వాహన సేవ, 4న సింహ వాహన సేవ, 5న వెండి రథోత్సవం నిర్వహిస్తారు.



123 'ఆలీవ్‌రిడ్లే'లు సముద్రంలోకి విడుదల



తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడుదల చేస్తున్న డీఎఫ్‌వో భీమయ్య

వేటపాలెం: మండల పరిధిలోని రామాపురం సముద్రతీరంలోని తాబేళ్ల సంరక్షణ కేంద్రం నుంచి 123 ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల పిల్లలను బాపట్ల జిల్లా డీఎఫ్‌వో ఎల్ భీమయ్య ఆదివారం సముద్రంలోకి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సముద్రతీరంలో ఏర్పాటుచేసిన సంరక్షణ కేంద్రంలో ఎనిమిది తల్లి తాబేళ్ల నుంచి 950 గుడ్లు సేకరించామన్నారు. వీటిల్లో నాలుగు తాబేళ్ల నుంచి సేకరించిన 410 తాబేళ్లను నాలుగుసార్లుగా సురక్షితంగా సముద్రంలోకి వదిలామని పేర్కొన్నారు. మూడు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంటుందని చెప్పారు. ఆలీవ్ రిడ్లీ సముద్ర తాబేళ్లు మత్స్యకారులకు నేస్తాలన్నారు. ఇవి సముద్రంలోని నాచును తినడంవల్ల చేపలకు ఎంతగానో ఉపయోకరంగా ఉంటుందన్నారు. సముద్రంలోని జీవరాసులకు ఆక్సిజన్ అందించడంలోనూ, మత్స్య సంపద పెంపొందించడంలో తోడ్పతాయన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ట్రీ ఫౌండేషన్ ఎఫ్ ఆర్‌ఓ ఆర్ శ్రీదేవి, ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బీఓ శవనం చంద్రారెడ్డి, లక్ష్మయ్య, నాగరాజు జాలయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాకారులకు మంచి ప్రోత్సాహకాలు ఉన్నాయని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. అసోంలోని గౌహతిలో ఈ నెల 24న జరిగిన 4వ ఏషియన్ ఖోఖో టోర్నమెంట్‌లో బాపట్ల జిల్లా జె.పంగులూరు నుంచి అట్ల శివనాగిరెడ్డి పాల్గొని దేశం తరఫున ఆడి బంగారు పతకం సాధించడంలో కీలకభూమిక పోషించాడు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కోన రఘుపతి శివనాగిరెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గానికి చెందిన శివనాగిరెడ్డి ఏషియన్‌లో బంగారు పతకం సాధించడం గొప్ప విషయమన్నారు. శివనాగిరెడ్డికి ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఖోఖో క్రీడాకారులకు మంచి శిక్షణ ఇస్తున్న అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వై.అశ్వనీరెడ్డి ఉన్నారు.

అంతర్జాతీయ ఖోఖో టోర్నీలో స్వర్ణం

జే.పంగులూరు: అసోంలోని గౌహతి తిమల్‌పుర స్టేడియంలో ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించిన అంతర్జాతీయ 4వ ఏషియన్ ఖోఖో పోటీల్లో భారత పురుషుల జట్టు బంగారు పతకం సాధించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డి పోటీల్లో పాల్గొని జట్టుకు బంగారు పతకం దక్కడంలో కీలకపాత్ర పోషించాడు. అసోం రాష్ట్రం నుంచి పంగులూరు వచ్చిన సందర్భంగా శివనాగిరెడ్డికి ఖోఖో



అట్ల శివనాగిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ఎంఎస్ త్యాగి, మిట్టల్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ బాచిన చెంచుగరటయ్య, మాగుంట కళాశాల చైర్మన్ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఏపీ శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చీఫ్‌ప్యాట్రన్ ఉగ్రనరసింహారెడ్డి, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం అభినందించారు. సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 16 దేశాలు పాల్గొన్నాయని తెలిపారు. భారత జట్టు మంచి ఆటతీరు కనబరిచి మొదటి స్థానం సాధించిందన్నారు. ఈ జట్టులో మన రాష్ట్ర క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డి సత్తా చాటి దేశం గెలుపునకు దోహదపడ్డారని కొనియాడారు. అనంతరం క్రీడాకారుడు శివనాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి



శివనాగిరెడ్డిని అభినందిస్తున్న కృష్ణచైతన్య

అంతర్జాతీయ క్రీడాకారునిగా ఎదిగినందుకు ఎంతో సంతోషంగా ఉందని, దేశానికి బంగారు పతకం తీసుకురావడంలో భాగస్వామిని అయినందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, నడిపించిన గురువు సీతారామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

సామాజిక చైతన్యానికి వెంకటరాయలు కృషి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్

చిలకలూరిపేట: జీవిత కాలం సామాజిక చైతన్యానికి కృషి చేసిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ దివంగత తోటకూర వెంకటరాయలు పేరున ఫౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని నన్నపనేని వెంకటరత్నం కల్యాణ మండపంలో వెంకటరాయ, శ్రీధర్ ఫౌండేషన్ ప్రారంభోత్సవంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మన వేదాల్లో గురువుకు భగవంతుని పక్కన చోటు దొరికిందని, తోటకూర వెంకటరాయలు అధ్యాపకుడిగా వేలాది మంది విద్యార్థుల మెప్పు పొంది, ఆ నానుడి నిజం చేశారని కొనియాడారు. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు గ్రామీణ విద్యార్థులు ఇంగ్లిష్ స్కిల్స్‌లో సాధించేందుకు ఫౌండేషన్ దోహదపడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. క్యాన్సర్ నివారణ ఉద్యమంలో కీలక భూమిక పోషించగలదని అభిలషించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సినీ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోని వృత్తుల్లోకెల్లా అధ్యాపక వృత్తి ఎంతో అత్యుత్తమమైనదని, వెంకటరాయలు జీవితాంతం వృత్తి ధర్మాన్ని పాటించారని కొనియాడారు. ప్రత్యేక అతిథి బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి అంకాలజీ, అనస్థీషియా చీఫ్ డాక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ నిర్మూలన కార్యక్రమంలో భాగస్వామి కావడానికి ఫౌండేషన్ సంసిద్ధత తెలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోటకూర శ్రావణ్ శ్రీనివాస్, కార్యదర్శి తోటకూర వెంకటనారాయణ, తేళ్ల సుబ్బారావు, జాష్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దళితులందరూ ఏకతాటిపై ఉండాలి

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి మారుతీ విక్టర్ ప్రసాద్



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేస్తున్న అతిథులు

మేదరమెట్ల: దళితులందరూ ఏకతాటిపై ఉంటూ తమ హక్కుల పరిష్కారం కోసం పాటుపడాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి మారుతీ విక్టర్ ప్రసాద్ అన్నారు. దళిత యువజన వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో కొరిశపాడు మండలంలో మేదరమెట్ల సెంటరులోని నాభిశిల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, అంబేద్కర్ సూచించిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా యువత మోటారు బైక ర్యాలీని గ్రామంలో నిర్వహిస్తూ అతిథులను ఊరేగించారు. సోమవరప్పాడు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహ ప్రతిష్ఠకు చెందిన శిలాఫలకాన్ని అతిథులు ప్రారంభించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరయ్య, ఆక్టోపస్ ఎస్పీ బల్లి రవిచంద్ర, ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, మేదరమెట్ల సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, యువజన వెల్ఫేర్ సంఘం సభ్యులు, పలు గ్రామాల దళిత సోదరులు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు



బైక్‌లను పరిశీలిస్తున్న నార్త్ డీఎస్పీ జె.రాంబాబు, సీఐ బి.సురేష్‌బాబు

పెదకాకాని: ఎలక్ట్రికల్ బైక్‌ల చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు గుంటూరు నార్త్ డీఎస్పీ జె రాంబాబు అన్నారు. పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జె రాంబాబు వివరాలు వెల్లడించారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామంలో శివరామయ్య అండ్ సన్స్ పేరుతో గుంటూరుకు చెందిన పెద్ది శివరామయ్య ఈ బైక్ గోడౌన్ నడుపుతున్నాడు. గుంటూరు లక్ష్మీపురంలో కొన్ని బైక్‌లను డిస్‌ప్లేగా పెట్టి కస్టమర్లు నేరుగా ఈ బైక్‌లు కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తున్నాడు. గోడౌన్‌లో ఐదుగురు వర్కర్లు పనిచేస్తున్నారు. వారిలో సూపర్‌వైజర్‌గా వెంకయ్య, మెకానిక్‌లుగా షేక్ ముస్తఫా, వెంకట్, పవన్, కుమార్‌లు పనిచేస్తున్నారు. కొంతకాలం కిందట ఉద్యోగం మానివేసిన వెంకట్ మెకానిక్ ముస్తఫా, డ్రైవర్ ఖాదర్‌బాషాతో కుమ్మక్కై నాలుగు నెలలుగా తొమ్మిది ఎలక్ట్రికల్ బైక్‌లను అపహరించారు. ఈ బైక్‌ను మెకానిక్ ముస్తఫా ఇంటి వద్ద ఉంచి అమ్మకానికి పెట్టారు. యజమాని పెద్ది శివరామయ్య ఈనెల 23వ తేదీన గోడౌన్‌కు వచ్చినపుడు వెనుక వైపు ఉన్న తలుపుకు తాళాలు తీసి ఉన్నాయి. అనుమానం వచ్చి గోడౌన్‌లో ఉన్న బైక్‌ను లెక్కించగా తొమ్మిది తగ్గాయి. వాటి విలువ రూ.3,50,000 ఉంటుందన్నారు. శివరామయ్య పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మెకానిక్ షేక్ ముస్తఫాను అదుపులోకి తీసుకుని అతని ఇంటి వద్ద ఉన్న తొమ్మిది ఎలక్ట్రికల్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో వెంకట్, ఖాదర్ బాషాలను అరెస్టు చేయాల్సి ఉంది. ముస్తఫాను ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ జె రాంబాబు తెలిపారు. సమావేశంలో పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు, ఎస్ఐలు వి రాంబాబు, పి కోటేశ్వరరావు, కె గీతాంజలి పాల్గొన్నారు.

యువత వల్లే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

- గుంటూరు జిల్లా సీసీఎస్ డీఎస్పీ బి.మోజెస్ పాల్
- రోడ్డు భద్రతపై విజ్ఞాన్‌లో అవగాహన కార్యక్రమం



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీసీఎస్ డీఎస్పీ మోజెస్‌పాల్

చేబ్రోలు: యువతలో వచ్చే మార్పుతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని గుంటూరు జిల్లా సీసీఎస్ డీఎస్పీ బీ.మోజెస్ పాల్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం రోడ్డు భద్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ దేశంలో యువత ఎక్కువగా ఉన్నారని, రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోయే వారిలో ఎక్కువ మంది యువతే ఉన్నారని పేర్కొన్నారు. యువత ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు గుండెకోత మిగల్చరాదన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదాల్లో మరణించకూడదనే ఉద్దేశంతో అన్ని రకాలుగా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని పదేపదే అవగాహన కల్పిస్తున్నప్పటికీ యువత పెడచెవిన వేస్తున్నారన్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీ రాఘవరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ కన్సల్టెంట్ ఎం.డి.హనీఫ్ మాట్లాడుతూ ప్రయాణికులను సుఖంగా, భద్రంగా గమ్యం చేర్చాలన్నా, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నా డ్రైవర్ల అప్రమత్తతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ గురించి వివరించారు. ఆయా విభాగాల డీన్లు, అధ్యాపకులు, వర్సిటీ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

హలీం వ్యాపారులు నిబంధనలు పాటించడం తప్పనిసరి

కోవిడ్–19 దృష్ట్యా మాస్కులు, శానిటైజర్లు వాడాలి



హలీం వ్యాపారులు, ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: జిల్లాలోని హలీం వ్యాపారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ముస్లిం పెద్దలు, సోదరులు, హలీం వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ హలీం దుకాణాల వద్ద వాహనాల నిలుపుదల, రాకపోకలతో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. దేశంలో కోవిడ్–19 కేసుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలని చెప్పారు. మాస్కులు, శానిటైజర్లు తప్పనిసరిగా వాడాలని పేర్కొన్నారు. ప్రార్థన వేళల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా వాహన రాకపోకలు జరిగేలా పోలీస్ అధికారులు విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు. సమావేశంలో తూర్పు డీఎస్పీ బి.సీతారామయ్య, పశ్చిమ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు హైమారావు, ఎస్.వి.రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఎం.సుబ్బారావు, అక్కేశ్వరరావు, నిషార్ బాషా, సుబ్బారావు, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు మృతి

మొక్కజొన్న పంటకు నీరుపెడుతుండగా ఘటన



వీరారెడ్డి (పాత చిత్రం)

పెదకూరపాడు: పాము కాటుకు గురై రైతు మృతి చెందిన ఘటన పరస గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వజ్రాల వీరారెడ్డి (56) కాశిపాడులో 4.50 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పైరుకు నీరు పెట్టేందుకు తన కుమారుడు వజ్రాల నాగార్జునరెడ్డితో కలిసి వెళ్లారు. కుమారుడు నాగార్జునరెడ్డి తండ్రికి టిఫిన్ తీసుకువచ్చేందుకు 75 త్యాళ్ళూరు గ్రామం వెళ్లాడు. టిఫిన్ తీసుకొని పొలం వద్దకు వచ్చేటప్పటికి తండ్రి వీరారెడ్డి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించాడు. వీరారెడ్డి ఎడమ కాలికి పాము కాటు వేసినట్లు గుర్తులు ఉండటంతో చుట్టుపక్కల వారిని పిలిచి ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే వీరారెడ్డి మృతి చెందాడు. పెదకూరపాడు తహసీల్దార్ క్షమారాణికి, పోలీసుస్టేషన్‌లో కుమారుడు నాగార్జునరెడ్డి తెలియజేశారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మహాభారతం బహూకరణ



మంత్రి కిషన్‌రెడ్డికి మహాభారత పర్వాలను అందిస్తున్న అన్నం మహిత, తండ్రి నరసింహారావు

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారిణి అన్నం మహిత ఆదివారం కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డిని కలిసి తాను స్వయంగా తయారు చేసిన మహాభారతంలోని 18 పర్వాలు, 700 శ్లోకాలను పెన్సిల్ మొన (లిడ్స్)పై చెక్కి సిద్ధం చేసిన కళాకండాలను అందించారు. హైద్రాబాద్‌లోని బర్కత్‌పూర్‌లో మంత్రి కిషన్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి వాటిని బహూకరించారు. తాను మహాభారత 18 పర్వాలను పెన్సిల్ లిడ్స్‌పై లిఖించడాన్ని ప్రధాని నరేంద్రమోదీకి బహూకరించాలని ఉందని, ఆయన అపాయింట్‌మెంట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశానని మహిత సాక్షికి తెలిపింది. నైపుణ్యంతో పెన్సిల్ మొనలపై లిఖించిన సూక్ష్మ కళను చూసి ఆయన మహితను అభినందించారు. తప్పకుండా త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ దగ్గరకు తీసుకెళ్లే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చినట్లు మహిత తెలిపింది. ఆమె వెంట ఆమె తండ్రి అన్నం నరసింహారావు ఉన్నారు.

చిన్న సినిమాలకు వైజాగ్ అనుకూలం

సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు



రాఘవేంద్రరావుకు బాబా చిత్రపటాన్ని బహూకరిస్తున్న మందిర కమిటీ చైర్మన్ పాతూరి

మంగళగిరి: చిన్న సినిమాలకు విశాఖపట్టణంలోని అరకు ప్రాంతం అనుకూలంగా ఉంటుందని ప్రముఖ సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ఉన్న భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు పర్యాటక కేంద్రాలు సినిమా షూటింగులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. వాటిల్లో అరకు, విజయవాడ భవానీ ఐలాండ్ ప్రధానమైనవని చెప్పారు. ఓటీటీలతోపాటు మరికొన్ని కారణాల వల్ల చిన్న సినిమాలకు ఆదరణ తగ్గుతోందన్నారు. సినీ దర్శకుడు రాజమౌళి పడ్డ కష్టమే ఆస్కార్ అవార్డు రావడానికి కారణమని తెలిపారు. తొలిసారి తెలుగు సినీ పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించి ఆస్కార్ అవార్డు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. సినీ నటుడు రాజేంద్రప్రసాద్ కూడా సాయి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిద్దరిని ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం సత్కరించి బాబా చిత్రపటాల్ని బహూకరించారు.

ఎన్‌టీఆర్ పురస్కారం అందుకోవడం అదృష్టం

ప్రముఖ సినీ నటుడు రాజేంద్రప్రసాద్



రాజేంద్రప్రసాద్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్

తెనాలి టౌన్: ఎన్‌టీఆర్ పేరు మీదుగా చలన చిత్ర పురస్కారం అందుకోవడం జీవితంలో మరచిపోలేనిదని, తెనాలిలో తమకు అద్భుతమైన సన్మానం జరగడం తన అదృష్టమని ప్రముఖ సినీనటుడు, నట కిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. నాజర్‌పేటలోని ఎస్‌వీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి శకపురుషుడు ఎన్‌టీఆర్ శత జయంతి మహోత్సవాల సభ నిర్వహించారు. సభకు సహజకవి అయినాల మల్లేశ్వరరావు స్వాగతం పలుకగా, ప్రముఖ పాత్రికేయుడు యర్రాప్రగడ రామకృష్ణ సభా పరిచయం చేశారు. సభకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. సభలో ఎన్‌టీఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాన్ని నట కిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు ఎన్‌టీఆర్ సోదరుని కుమారుడు నందమూరి రాంప్రసాద్, సినీ రచయిత సాయిమాధవ్, రాజేంద్రప్రసాద్ అందజేశారు. అనంతరం సభలో సినీ నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ పుట్టిన నిమ్మకూరులోనే తాను కూడా జన్మించానని తెలిపారు. ఎన్‌టీఆర్ పోషించిన పాత్రలు సినీ రంగంలో ఎవరూ పోషించలేదని, ఆయనకు మించిన నటుడు ఎవరు లేరని కొనియాడారు. ఎన్‌టీఆర్ అవార్డు అందుకున్నందుకు పైలోకంలో ఉన్న ఆయన సంతోషపడతారని తెలిపారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి తెలియజేసిన మహానుభావుడు ఎన్‌టీఆర్ అని పేర్కొన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వివక్షత చూపుతోందని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ ప్రేక్షకులను కన్నీళ్లతో నవ్వించగలిగిన నటుడు రాజేంద్రప్రసాద్ అని, ఆయనకు ఎన్‌టీఆర్ అవార్డు ఇవ్వడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు జాతి గర్వపడేలా నవ్విస్తూ నవ్వుతూ ఉండే వ్యక్తి రాజేంద్రప్రసాద్ అని కొనియాడారు. తొలుతగా న్యాయవాది జగదీశ్వరాంబ జ్యోతి ప్రజ్వలన చేశారు. వేదికపై ఎన్‌టీఆర్ విగ్రహానికి నాయకులు, ముఖ్య అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో మహిళ కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, సినీ ఛాయాగ్రాహకులు ఎస్.గోపాల్‌రెడ్డి, సినీ రచయిత ఎం.ఎస్. శాస్త్రి, సినీ పాత్రికేయులు అంబటి సురేంద్రరాజు, యు.వినాయకరావు, ఎన్‌టీఆర్ కాస్ట్యూమ్స్ టైలర్ వాలేశ్వరరావు, నందమూరి చిత్రశాల ప్రసాద్ తదితరులు మాట్లాడారు. తొలుతగా పెసర్లంక వసంత దుర్గ శిష్యబృందం కూచిపూడి నాట్య ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమాన్ని మహోత్సవాల కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.